## కేటీఆర్ రోడ్ షో



కుత్బుల్లాపూర్‌లోని షాపూర్ నగర్‌లో శనివారం రాత్రి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు రోడ్‌షో నిర్వహించారు. మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి ఓటువేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద పాల్గొన్నారు.

– సుభాష్‌నగర్



## సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

### మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్ గౌతమ్

**కుత్బుల్లాపూర్:** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి గౌతమ్ అన్నారు. సుచిత్రలోని లయోల జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఈవీఎం కమిషనింగ్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ నెల 13న జరగనున్న ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి నర్సింహులు, తహసీల్దార్లు ఉన్నారు.

## యువతి అదృశ్యం



అనూష (ఫైల్)

**సూరారం:** పని నిమిత్తం బయటకు వెళ్లిన యువతి అనుమానాస్పద స్థితిలో అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన మేరకు.. సూరారం శివాలయనగర్‌కు చెందిన పాలోత్‌రాజు కుమార్తె అనూష(19) స్థానికంగా ఉన్న మస్తానా బిల్డర్స్‌లో ఫంక్షన్ పని ఉందని ఈ నెల 2న వెళ్లింది. ఫంక్షన్ పూర్తయినా కుమార్తె ఇంటికి చేరుకోకపోవడంతో ఆమె మొబైల్‌కు ప్రయత్నిస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## మోదీని మూడోసారి పీఎం చేయాలి


**కుత్బుల్లాపూర్:** దేశంలో టెర్రరిస్టులకు, మిలిటెంట్లకు సింహస్వప్నంగా, సైనికులకు అండగా నిలబడ్డ ప్రధాని నరేంద్ర మోదీని మూడవ సారి గెలిపించాలని బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ కోరారు. కుత్బుల్లాపూర్‌లోని వెంకటేశ్వనగర్‌లో నిర్వహించిన బ్రేక్ ఫాస్ట్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఏమాత్రం నెరవేర్చలేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. తనను గెలిపిస్తే మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో నెలకొన్న సమస్యలను స్వయంగా మోది దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు.



కుత్బుల్లాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఈటల రాజేందర్

# కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి

**రంగారెడ్డినగర్:** కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డి విజయం సాధించడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని రంగారెడ్డినగర్, పంచశీల కాలనీ, చెన్నారెడ్డినగర్ కాలనీల్లో శ్రీశైలంగౌడ్ విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా ముందుకు సాగుతోందని, రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనించాలంటే కేంద్రంలో సైతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

## అభివృద్ధి పనులపై పర్యవేక్షణ కరువు



గిరినగర్‌లోని ఓ గల్లీలో నాసిరకంగా నిర్మించిన మ్యాన్‌హోల్

**రంగారెడ్డినగర్:** అభివృద్ధి పనుల్లో అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కాంట్రాక్టర్లకు ఆడిందే ఆటగా..పాడిందే పాటగా మారుతోంది.. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గిరినగర్‌లోని పలు గల్లీల్లో ఇటీవల జలమండలి ఆధ్వర్యంలో రూ. 50 లక్షల నిధులు వెచ్చించి భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోళ్లను నిర్మించారు. పనుల సమయంలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సదరు కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేపట్టి పూర్తి చేశాడు. మ్యాన్‌హోల్ పైభాగంలో చుట్టు ఫినిషింగ్‌ను తూతూ మంత్రంగా చేపట్టడంతో కొద్ది రోజులకే పెచ్చులూడుతున్నాయి. దీంతో పనుల నాణ్యత ప్రశ్నార్థకంగా మారుతోంది. పైనే పనులు ఇలా ఉంటే, ఇక లోపల పైపులైన్ పనులు ఎలా చేపట్టారోనన్న సందేహం కలుగుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో రోడ్లు వేసేంత వరకు మ్యాన్‌హోళ్లు ఉంటాయో, శిథిలావస్థకు చేరుతాయోనని వాపోతున్నారు.

## ఉత్సాహంగా ఎంఎల్‌ఆర్‌ఐటీ వార్షికోత్సవం

**దుండిగల్:** దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా శనివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హెక్సావేర్ టెక్నాలజీస్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ హెడ్ సొగతా సేన్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు చేసిన నత్యాలు అలరించాయి. వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, కోశాధికారి మమతరెడ్డి, డైరెక్టర్ శ్రేయరెడ్డి, ఏఐఎంఎస్ డైరెక్టర్ ధీరేన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస రావు, అరుంధతి ఆస్పత్రి డీన్ డాక్టర్ ఉదయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



వేడుకలను ప్రారంభించిన కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి

## జూన్ 18న సౌత్ ఇండియన్ వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్

హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ హెడ్ టీజీ శ్రీకాంత్

**గచ్చిబౌలి:** సౌత్ ఇండియన్ వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్ మూడో ఎడిషన్, టీసీఈఐ ఈవెంట్ ఎక్స్‌లెన్స్ అవార్డుల పంపిణీ నిర్వహిస్తున్నట్లు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ హెడ్ టీజీ శ్రీకాంత్ తెలిపారు. శనివారం కొండాపూర్‌లోని మాయా కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో తెలంగాణ చాంబర్స్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ(టీసీఈఐ) ఆధ్వర్యంలో జూన్ 18, 19న సౌత్ ఇండియన్ వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్, టీసీఈఐ అవార్డుల పంపిణీ ఉంటుందన్నారు. భారతీయ వివాహ పరిశ్రమలోని నిపుణులను ఒకే వేదికపైకి తీసుకొస్తున్నామని చెప్పారు. ఈవెంట్స్ బజార్ పేరిట 60 స్టాల్స్‌లో అత్యాధునిక ట్రెండ్స్‌ను ప్రదర్శిస్తారు. జూన్ 19న టీసీఈఐ ఈవెంట్ ఎక్స్‌లెన్స్ అవార్డుల పంపిణీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీసీఈఐ అధ్యక్షుడు బలరాం బాబు, ప్రధాన కార్యదర్శి రవి బూర, కోశాధికారి ఎండీ తౌఫిక్ ఖాన్, కన్వీనర్ సాయి శ్రవణ్ మాదిరాజు, టీసీఈఐ ఈవెంట్ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్–2024 కన్వీనర్ రామ్ కే ముప్పన, కో కన్వీనర్లు హరీష్ రెడ్డి, కుమార్‌రాజా, డాక్టర్ సౌరభ్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హెడ్ టీజీ శ్రీకాంత్, టీసీఐ ప్రతినిధులు

## అలరించిన త్యాగరాజ కృతులు

**మాదాపూర్:** కళాకారులు త్యాగరాజ కృతులు, పంచరత్న కీర్తనలతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం సాంప్రదాయ సంస్థ ఈశ్వర్ ప్రసాద్ శిష్యబృందం జగదానంద కారక సద్గురు త్యాగరాజ జయంతి ఉత్సవాన్ని నిర్వహించారు. శ్రీరామ్ జొన్నలగడ్డ శిష్యబృందం త్యాగరాజ కృతులు, పంచరత్న కీర్తనలు ఆలపించారు. వీరికి వయొలిన్ వాసుశాస్త్రీ, మృదంగం కృష్ణశ్రావణ్,అరవింద్,భార్గవ్, కీ బోర్డుపై సుమేద్‌లు సంగీత సహకారాన్ని అందించారు. నగరంలో ఉన్న సంగీత గురువులు పాల్గొన్నారు.

# పైప్‌లైన్ సామర్థ్యం పెంచాలి

**జీడిమెట్ల:** సుభాష్‌నగర్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ సామర్థ్యం పెంచాలని కాలనీవాసులు కోరుతున్నారు. సుభాష్‌నగర్‌లోని లాస్ట్‌బస్టాప్, వెంకటాద్రినగర్‌లో నిత్యం మ్యాన్‌హోళ్ల నుండి మురుగునీరు పైకి వచ్చి రోడ్డుపై పారుతుంది. దీంతో కాలినడకన రోడ్డుపై వెళ్లే బాటసారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మురుగునీరు ఇళ్ల ముందు పారుతుండటంతో తీవ్రమైన దుర్వాసన వెలువడుతుందని స్థానికులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. యూజీడి పైప్‌లైన్ సామర్థ్యం సరిపోకపోవడంతో ఔట్‌లెట్ నుండి మురుగునీరు సరిగా వెళ్లకపోవడంతో ప్రతిరోజు ఇలాంటి పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు.

**మున్సిపల్ సిబ్బందికి ప్రతినిత్యం తిప్పలే..**

ముఖ్యంగా సుభాష్‌నగర్ లాస్ట్‌బస్టాప్ ప్రాంతంలో మ్యాన్‌హోళ్లు కొంతమేరకు ధ్వంసం కావడంతో మట్టి, ప్లాస్టిక్ కాగితాలు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలోకి చేరుతున్నాయి. దీంతో ప్రతినిత్యం మున్సిపల్ సిబ్బంది ఉదయం కాలనీకి చేరుకుని మ్యాన్‌హోళ్లు శుభ్రం చేస్తున్నారు. అయినప్పటికి ప్రతినిత్యం ఇదే పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని యూజీడి పైప్‌లైన్ సామర్థ్యం పెంచడంతో పాటు మ్యాన్‌హోళ్లపై కొత్తమూతలు ఏర్పాటు చేయాలని సుభాష్‌నగర్ వాసులు కోరుతున్నారు.



సుభాష్‌నగర్ ప్రధానరోడ్డులో తెరచి ఉన్న మ్యాన్‌హోల్

## రాంగ్ రూట్ ఎఫెక్ట్.. వాహనాలు సీజ్

**నిజాంపేట్:** రాంగ్‌రూట్ వాహనదారులపై మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు.. శనివారం మియాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో సిబ్బంది బాచుపల్లి పరిధిలోని కోకకోలా కంపెనీ మార్గంలో రాంగ్‌రూట్‌లో వెళ్తున్న 17 ద్విచక్ర వాహనాలతో పాటు మియాపూర్ సంతోష్ దాబా సమీపంలో మరో 9 వాహనాలు, ఒక ఆటోను సీజ్ చేసి వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ఎస్ఐలు సుభాష్, మల్లేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు. రాంగ్‌రూట్‌లో వాహనాలు నడిపి ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ హెచ్చరించారు.

## సీడీ ఆవిష్కరణ

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూలో రాజ్యాంగం మార్పుపై రాసిన పాటల సీడీని ఆవిష్కరించారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఓయూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి అంసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంచాల లింగస్వామి అధ్యక్షతన పాటల సీడీని విడుదల చేశారు. ఈ పాటను కేశఆర్ బీమసేన రచించిగా గ్యాదరి జగన్ పాడారు.

## వ్యక్తి అదృశ్యం



అయ్యప్ప (ఫైల్)

**సుభాష్‌నగర్:** ఇంటి నుండి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు.ఈ ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన మేరకు.. సూరారం రాజీవ్ గాంధీనగర్‌కు చెందిన అయ్యప్ప(45), హైమవతిలు భార్యాభర్తలు. గత నెల 30న రాత్రి 7 గంటలకు బయటకు వెళ్లిన అయ్యప్ప ఇంటికి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు అతని కోసం చుట్టు పక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకపోయింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కంటోన్మెంట్‌కు బ్యాలెట్ యూనిట్ల కేటాయింపు

**సాక్షి, మేడ్చల్ జిల్లా:** మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కంటోన్మెంట్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు శనివారం కలెక్టరేట్‌లో వివిధ పార్టీ ప్రతినిధుల సమక్షంలో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ పాట్‌ల కేటాయింపు ప్రక్రియను రెండో దశ ర్యాండమైజేషన్ ద్వారా సాధారణ పరిశీలకులు డాక్టర్ ప్రియాంక శుక్లా నిర్వహించారు. ఇందులో మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల అధికారి గౌతమ్, కంటోన్మెంట్ జాయింట్ సీఈఓ ఆకాశ్ కుమార్ శర్మ, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పాల్గొన్నారు. కంటోన్మెంట్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 232 పోలింగ్ కేంద్రాలకు 580 బ్యాలెట్ యూనిట్లు, 290 కంట్రోల్ యూనిట్లు, 324 వీవీపాట్స్ కేటాయించినట్లు పేర్కొన్నారు.

## ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్ సందర్శన

**సాక్షి, మేడ్చల్ జిల్లా:** పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కోసం కూకట్‌పల్లి జేఎన్‌టీయూ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌ను మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల అధికారి గౌతమ్, జోనల్ కమిషనర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి అభిలాష్ అభినవ్‌తో కలిసి సందర్శించారు. పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ రిజిస్ట్రేషన్, ఓటర్స్ రిజిస్ట్రేషన్ వివరాలతో కూడిన రిజిస్టర్లను పరిశీలించి, ఇప్పటి వరకు పోస్టల్ బ్యాలెట్ పద్ధతిలో ఎంతమంది ఓటును వినియోగించుకున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి మురళి, ఎంఆర్‌ఓ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ఇన్‌చార్జి డీఈగా విష్ణువర్ధన్‌రెడ్డి



విష్ణువర్ధన్‌రెడ్డి, జీడిమెట్ల ఇంచార్జి ఏడీఈ

**కుత్బుల్లాపూర్:** జీడిమెట్ల డీఈ పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో ఇంచార్జి డీఈగా విష్ణువర్ధన్‌రెడ్డి నియమితులయ్యారు. గతంలో ఈయన కుత్బుల్లాపూర్ ఏడీఈగా అనుభవం ఉంది. ఇంచార్జి ఏడీఈగా బాధ్యతలు చేపట్టిన విష్ణువర్ధన్‌రెడ్డి సాక్షితో మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ కోతలు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లోఓల్టేజీ సమస్యలున్న ప్రాంతాల్లో అదనంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నామని, నాణ్యమైన నిరంతర విద్యుత్ అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఏ ప్రాంతంలోనైనా విద్యుత్ అవాంతరాలు తలెత్తితే వెంటనే తమ సిబ్బందికి పంపించి మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తున్నామని విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు.



## బీఈడీ, ఎంఈడీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

**రాయదుర్గం:** మనూలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (డీఈఅండ్‌టీ) ఆధ్వర్యంలో బీఈడీ, ఎంఈడీ కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని డీఈ అండ్ టీ హెడ్ ప్రొఫెసర్ షాహీన్ అల్తాఫ్ షేక్ శనివారం తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తులుంటాయని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పరిమిత సంఖ్యలో హాస్టల్ సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. ప్రవేశ ఆధారిత కోర్సులకు దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ మే 20 అని మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్, ఫోన్ నంబర్లు 9618783492, 9959195495లలో సంప్రదించాలని కోరారు.

## ఓయూ సివిల్ అకాడమీ సందర్శన

**ఉస్మానియా యూనివర్సిటీ:** రాష్ట్ర ఉన్నత విద్య ముఖ్యకార్యదర్శి బుర్ర వెంకటేశం ఓయూ సివిల్ అకాడమీని సందర్శించారు. శనివారం వీసీ రవీందర్‌తో కలిసి ఓయూ, బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ఉచిత కోచింగ్ సెంటర్‌కు హాజరై తరగతుల నిర్వహణ, విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పేద విద్యార్థులకు ఉచితంగా శిక్షణ అందిస్తున్న ఓయూ సివిల్ అకాడమీకి అన్ని విధాలుగా సహకారం అందిస్తామన్నారు. ఓయూ సివిల్ అకాడమీ డైరెక్టర్ ప్రొ.కొండ నాగేశ్వర్‌రావు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్స్‌కు ఉగాది పురస్కారాలు

**సనత్‌నగర్:** మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది పురస్కారాలకు ఎంపికైన మరో ఇద్దరికి శనివారం అవార్డులు ప్రదానం చేశారు. వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సీనియర్ సిటిజన్స్ సుజాతమ్మ, సురేందర్‌నాయిలకు ఉగాది పురస్కారాలను అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జేఎస్‌టీ శాయి ప్రదానం చేశారు.